పనులు నాణ్యతగా చేపట్టాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ దవాఖాన ఆకస్మిక తనిఖీ

వికారాబాద్ : నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ దవాఖానను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, డిసెంబర్ 3 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేపడుతున్న పనులు నాణ్యతగా ఉండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జనరల్ దవాఖానను ప్రారంభించనున్న క్రమంలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ గదులను పరిశీలించి ఆసుపత్రి ఆవరణతోపాటు గదులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం అనంతగిరిగుట్టలో నిర్మించిన సమీకృత ఆయుష్ వైద్యశాలను పరిశీలించారు. వైద్యశాల ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలను సమర్పించాలని టీఎస్ జీఎంఐడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, డీఎంహెచ్‌వో వెంకటరమణ ఉన్నారు.

ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఉన్నత చదువులతో పాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్నేపల్లి చౌరస్తా నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు కలెక్టర్ ఎస్పీ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా అధికారులు, విద్యార్థులు, యువకులతో కలిసి 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీవైఎస్‌వో హనుమంతరావు, డీటీడీవో కమలాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలకు 2024 (సర్పంచ్, వార్డు సభ్యులు) సిద్ధం చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని 585 గ్రామపంచాయతీల్లో 4,982 వార్డులవారీగా ఓటర్ల సంఖ్య ప్రకారం పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటు కోసం షెడ్యూలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ స్టేషన్ల జాబితాను తయారు చేయడం, ఈ నెల 6న జిల్లా ఎన్నికల అధికారి నుంచి ఆమోదం పొందడం జరుగుతుందన్నారు. ఎంపీడీవోల ద్వారా పోలింగ్ స్టేషన్ల జాబితా ముసాయిదా ప్రచురణకు 7న నిర్వహించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారిచే జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో 10న, మండల స్థాయిలో ఎంపీడీవోల ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం 12న నిర్వహించాలన్నారు. పోలింగ్ స్టేషన్ల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ 7 నుంచి 12 వరకు ఉంటుందన్నారు. పోలింగ్ స్టేషన్ల జాబితాల అభ్యంతరాలు, సూచనల తొలగింపు ఈ నెల 13న ఉంటుందన్నారు. పోలింగ్ స్టేషన్ల తుది జాబితా కోసం జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం 16న ఉంటుందన్నారు. ఎంపీడీవోల ద్వారా పోలింగ్ కేంద్రాల జాబితా తుది ప్రచురణ 17న ప్రకటించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

అల్పాహార సౌకర్యాల ఏర్పాట్లు చేపట్టాలి

కొడంగల్ : నర్సింగ్ కళాశాల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో పర్యటించి సమీకృత బాలికల వసతి గృహ సముదాయంలో తాత్కాలికంగా నిర్వహించే నర్సింగ్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. భవనంలో నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సంబంధించి మౌలిక సదుపాయాలతోపాటు కావాల్సిన మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని సూచించారు. అనంతరం హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించే వంటశాలను కలెక్టర్ సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలోని 8 మండలాల్లోని 312 పాఠశాలల్లో 27 వేలకు పైగా విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, డీఈ రాకేశ్ పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిన్నచూపు తగదు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి డీబీ శీతల్

వికారాబాద్, డిసెంబర్ 3 : మానసిక వైకల్యం ఉన్నవారిని చిన్నచూపు చూడకూడదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి డీబీ శీతల్ తెలిపారు. మంగళవారం మానసిక దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో భవిత సెంటర్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. సెంటర్లో ఉన్న దివ్యాంగులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వినికిడి లోపం ఉన్న వ్యక్తులందరికీ చెవి మెషిన్లు, మానసిక వైకల్యం ఉన్న వ్యక్తులకు తగిన మందులున్నాయా లేవా అనే విషయాన్ని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్, డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ రాము, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్, ప్యానల్ అడ్వకేట్ శంకరయ్య, ఇతర డాక్టర్ల బృందం పాల్గొన్నారు.

రేపు డీఈఈ సెట్ రెండో విడత

సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వికారాబాద్, డిసెంబర్ 3 : ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డీఈఈ సెట్ 2024-26 రెండు సంవత్సరాల కోర్సులో చేరడానికి రెండో విడత సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు ఈ నెల 5న హాజరు కావాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నవారికి 13న సీట్లు కేటాయిస్తారన్నారు. 13 నుంచి 17 వరకు ఫీజు చెల్లించి, అలాట్‌మెంట్ లెటర్‌తో సీటు అలాట్ అయిన కళాశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలను కళాశాలలో సమర్పించి రిపోర్ట్ చేయాలన్నారు. కళాశాల బదిలీ కోసం 7 నుంచి 9 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

అంబేద్కర్ అభయ హస్తం అమలు చేయాలి

మర్పల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మర్పల్లి, డిసెంబర్ 3 : గత ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం తీసుకొచ్చిన దళిత బంధు పథకం స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం తీసుకొస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మర్చిపోయిందని బీజేపీ జడ్పీటీసీ అభ్యర్థి జంగం జైపాల్ మండిపడ్డారు. మంగళవారం తహసీల్దార్ మునిరొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు దళిత బంధును వెంటనే అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బలరాంగౌడ్, నాగన్న, శ్రీమంత్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, సురేశ్, తుల్జారాం, కృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

మున్సిపల్ కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్ల మండిపాటు

షాద్‌నగర్, డిసెంబర్ 3 : షాద్‌నగర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పట్ల వివక్ష మారోమారు బయటపటింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ గౌరవ ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్నారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపాలిటీ అయ్యప్పకాలనీలో అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ తాగునీటి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగానే అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మున్సిపల్ చైర్మన్ నరేందర్ పేరుకు ప్రాముఖ్యతను ఇవ్వకుండా కింది వరుసలో పొందుపర్చారు. ఈ విషయాన్ని గమనించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ వెంకన్నను నిలదీశారు. ప్రతిసారీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అగౌరవపర్చే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీలో మొదటి వ్యక్తి అయిన చైర్మన్ పేరుకు ప్రాధాన్యతను ఇవ్వకుండా తము ఇష్టం వచ్చినట్లు, అగౌరవపరిచేవిధంగా వ్యవహరించారని వాగ్వాదానికి దిగారు. గతంలో ఎప్పుడు కూడా ఏ అధికారీ ఇలా ప్రవర్తించలేదని, ప్రాధాన్యత ప్రకారం ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారులకు ఉంటుందనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు నర్సింహులు, అంతయ్య, రాజు తెలిపారు. ఇదిలా ఉంటే ప్రొటోకాల్ ప్రకారమే శిలఫలకాన్ని చెక్కించామని కమిషనర్ వివరించారు.

గురుకులంలోకి వెళ్లకుండా ఎందుకు తాళం వేశారని అడుగుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

మాట్లాడుతామంటే అడ్డుకుంటారా..?

ఆగ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు

పరిగి, డిసెంబర్ 3 : రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇటీవల ఫుడ్ ఫాయిజన్ సంఘటనలు చోటుచేసుకోవడంతో గురుకులాల్లో అసలు పరిస్థితులు తెలుసుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం పరిగి పట్టణ శివార్లలోని గురుకులాల సందర్శనకు వెళ్లిన మున్సిపల్ చైర్మన్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు లోపలికి రాకుండా గురుకులాలకు తాళాలు వేసి అడ్డుకోవడం గమనార్హం. పార్టీ పిలుపుతో మంగళవారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, గురుకుల బాట జిల్లా ఇన్‌చారిజ, బీఆర్ఎస్వీ నాయకుడు జంగయ్య, కౌన్సిలర్ మునీర్, నాయకులు రవికుమార్, తాహెర్‌అలీ, వెంకటేశ్ సయ్యద్ మల్కాపూర్ సమీపంలో గల మైనార్టీ గురుకులానికి వెళ్లగా విద్యార్థులతో కలువకుండా గేట్‌కు తాళం వేశారు. తాము కేవలం విద్యార్థులతో మాట్లాడతామని మున్సిపల్ చైర్మన్ అశోక్ పేర్కొనగా.. కలెక్టర్ అనుమతి తీసుకునే లోపలికి రావాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ చెప్పారు. అలాగే తుంకులగడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకులంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా లోపలికి రావడానికి అనుమతి లేదని ప్రిన్సిపాల్ చెప్పారు. గురుకులంలో అన్ని వసతులు బాగున్నాయని, విద్యార్థులకు చక్కటి భోజనం అందుతుందని పేర్కొన్నారు. పరిగిలో 1984 ప్రాంతంలో గురుకులం ఏర్పాటు చేయించిందే మాజీ ఎమ్మెల్యే హరీశ్వర్‌రెడ్డి అని, అన్ని వసతులు తాము కల్పించగా తమను ఎందుకు రానీయరని ప్రశ్నించగా తమ పరిస్థితి అర్థం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ దశలో గురుకుల బాట నేపథ్యంలో గురుకులంలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు కానిస్టేబుల్ బీఆర్ఎస్ నాయకుల బృందం వచ్చిన విషయం తెలియజేయడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న పరిగి ఎస్ఐ సంతోశ్‌కుమార్, పోలీసులు గురుకులంలోకి వెళ్లడానికి ఎవరికీ అనుమతి లేదని బీఆర్ఎస్ బృందానికి చెప్పారు. గురుకులాల్లో అసలు సమస్యలే లేకుంటే తమను ఎందుకు వెళ్లనివ్వడం లేదని, ఎందుకు దాస్తున్నారని బీఆర్ఎస్ బృందం ప్రశ్నించింది.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

బీవీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఆమరణ నిరాహార దీక్ష

కొడంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్న దివ్యాంగులు

కొడంగల్, డిసెంబర్ 3 : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి(బీవీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు. మంగళవారం జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమస్యల పరిష్కారానికిగాను ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అద్దె రాజేశ్, ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, మహిళా అధ్యక్షురాలు సుమతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టూరు ఈదయ్యబాబు, జిల్లా అధ్యక్షుడు పోతురాజు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు రూ.6016 పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నప్పటికీ నేటి వరకు కొత్త పెన్షన్ అమలు కావడం లేదన్నారు. అదేవిధంగా వితంతువులకు ఆసరా పింఛన్‌ను రూ.4016 అందిస్తామని నేటి వరకు కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. తెలంగాణలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా నడువలేనివారికి 3 వీలర్ మోటార్ బైక్‌లను ఇవ్వాలని, బ్యాంకులతో సంబంధం లేకుండా దివ్యాంగులకు రూ.10లక్షల వరకు సబ్సిడీ రుణాలివ్వాలని, ఆర్టీసీ బస్సులో ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగుల సంక్షేమ శాఖను వేరు చేయాలని, పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఎన్నికల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని, దళిత బంధు, బీసీ బంధు మాదిరిగా దివ్యాంగులకు ప్రత్యేక పథకాన్ని ఏర్పాటు చేసి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి, వివిధ జిల్లా, రాష్ట్ర, మండల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నల్గొండ అడిషనల్ ఎస్పీ రాములునాయక్

ఎర్రమట్టి దందాపై విచారణ

- ప్రభుత్వ ఆస్తిని సొమ్ము చేసుకోవడం చట్టరీత్యా నేరం
- నల్గొండ అడిషనల్ ఎస్పీ రాములునాయక్

నవాబుపేట, డిసెంబర్ 3 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న మైనింగ్‌ను కొంతమంది అక్రమంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారన్న సమాచారంతో ఐజీ సత్యనారాయణ మల్టీజోన్-2 ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నామని నల్గొండ జిల్లా అడిషనల్ ఎస్పీ రాములునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్టిగిద్ద, అర్కతల, యావపూర్ గ్రామాల్లో గల మైనింగ్‌ను పరిశీలించి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచుల ద్వారా కొంత సమాచారాన్ని సేకరించామన్నారు. ఎర్రమట్టిని అక్రమంగా తరలించినవారిపై చట్టపరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని, అందుకే విచారణ ప్రారంభించామని తెలిపారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా కూడా తాము వివరాలను రాబడుతున్నామని, ఒకవేళ మట్టిని తవ్వినచో అది ప్రభుత్వ భూమా, లేక ప్రైవేట్ భూమా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. చెరువుల్లో ఉన్న మట్టిని కూడా తవ్వుతున్నారా.. తవ్వితే ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ పర్మిషన్ ఉందా ఉంటే ఎంతవరకు ఇచ్చారు అని విచారణ చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తిని ఎవ్వరు కూడా అక్రమంగా సొమ్ము చేసుకోకుండా చూసే బాధ్యత మనందరిది అని విలేకరులతో ఆయన అన్నారు. ఆయన వెంట మిర్యాలగూడ సీఐ నాగార్జున ఉన్నారు.

డబ్బు లివ్వకుండా కాలయాపన

రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావుకు వినతి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 3 : ఆశ వర్కర్లతో పనులు చేయించుకొని వారికి డబ్బులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని రంగారెడ్డి జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సునీత అన్నారు. ఆశ వర్కర్‌లకు లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తరువాతనే కొత్త సర్వే చేయించాలని కోరుతూ మంగళవారం రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట తెలంగాణ ఆశ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. ప్రతి నెల ఆశలకు 1న వేతనాలు చెల్లించాలన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం 10 లక్షల రూపాయలు, వసతి కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాశ్, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, రాజేంద్రనగర్ మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు స్వామి, సభ్యులు సునంద, రాధిక, రమ్య, సుధ, మన్యం, యాదయ్య, రాజు, స్వామి తదితరులున్నారు.

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మలుపు తిప్పిన శ్రీకాంతాచారి ఆత్మబలిదానం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 3 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో శ్రీకాంతాచారి ఆత్మబలిదానం కీలక మలుపు తిప్పినట్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్ పేర్కొన్నారు. మంగళవారం శంషాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని ఎల్బీ నగర్ చౌరస్తాలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మబలిదానం చేసుకున్న వీరుడు శ్రీకాంతాచారి అని వివరించారు. తెలంగాణ రాష్ట్రం కోసం విద్యార్థులు చనిపోతున్నారని కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమ నాయకుడు కేసీఆర్ మరింత ఒత్తిడి తీసుకువచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రంతోనే ఇక్కడి ప్రాంతానికి న్యాయం జరుగుతుందని సకల జనుల సమ్మెకు దిగారని వివరించారు. దీంతో దిగి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ సాధించిన వీరుడిగా కేసీఆర్‌కు ప్రజలు అధికారం కట్టబెట్టడంతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, డీసీసీబీ కో-ఆప్షన్ సభ్యుడు మోహన్‌రావు, నాయకులు దీప, హన్మంతు, రాజేందర్, గుంటి చరణ్, భాస్కర్, రాజు, పరంధాములు, అశోక్, రమేశ్, జగ్గయ్య, శ్రీకాంత్‌యాదవ్, జంగారావు, శ్రీశైలం, మహేశ్‌యాదవ్ ఉన్నారు.

అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అటవీ శాఖ అధికారి వేణుమాధవ్

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న వేణుమాధవ్

మంచాల, డిసెంబర్ 3 : అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అటవీ శాఖ డివిజన్ అధికారి వేణుమాదవ్ అన్నారు. మంగళవారం మంచాల మండలం ఆగపల్లి అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో అటవి, వన్యప్రాణుల సంరక్షణ, అటవి నిప్పు నియంత్రణపై పంచాయతీ కార్యదర్శులకు, అటవీ శాఖ సిబ్బందికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల కాపరులు అడవుల్లోకి వెళ్లినప్పుడు సిగరెట్లు, బీడీలు కాల్చకుండా ఉండేందుకు పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. అడవులను కాపాడుకోవడం మన అందరి బాధ్యతని.. ఎక్కడైనా అడవుల్లో మంటలు వచ్చినట్లు ఉంటే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కస్నానాయక్, సెక్షన్ ఆఫీసర్లు నర్సింహ, చంద్రశేఖర్, విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలో హైవే రోడ్డు నిర్మాణ పనులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య

పూడూరు, డిసెంబర్ 3 : రోడ్డు పక్కనే కూరగాయలు అమ్ముతూ లారీ ప్రమాదంలో మృతిచెందడం ఆ కుటుంబాలకు తీరని లోటని పరిగి, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండలం మన్నెగూడలో చేవెళ్ల డివిజన్ అలూరు గేటు వద్ద జరిగిన ప్రమాదంపై, హైదరాబాద్-బీజాపూర్ హైవే రోడ్డు నిర్మాణ పనులపై ఎమ్మెల్యేలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూరగాయలు అమ్ముతూ జీవనం గడిపే చిరు కుటుంబాల్లో ఒకేసారి పలువురు మృతిచెందడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. హైదరాబాద్-బీజాపూర్ హైవే రోడ్డు నిర్మాణం గతంలోనే నిధులు మంజూరయ్యాయని పనులు కూడా కాంట్రాక్టర్లకు అప్పగించారని తెలిపారు. కాని కొందరు స్వచ్ఛంద సంస్థల సభ్యులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరకకుండా కోర్టుల్లో కేసు పెట్టినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కోర్టులోని కేసులు క్లియర్ చేసి గత నెల 28న సంబంధిత ఎన్‌హెచ్-163 అధికారులు, కాంట్రాక్టర్లకు పనులు ప్రారంభించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వారు తెలిపారు. అప్పా జంక్షన్ నుంచి పలు ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వికారాబాద్ నుంచి పరిగి, కొడంగల్, మక్తల్ వరకు రైల్వే లైన్ నిర్మాణానికై త్వరలో సర్వే చేయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటారని వివరించారు.

తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చేస్తున్న సమగ్ర ఆర్థిక కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో ఇంటర్నెట్ సర్వర్ మంగళవారం మొరాయించడంతో వివరాల నమోదు కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 30 శాతం మాత్రమే ఎంట్రీ చేశారు. డాటా ఎంట్రీ మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది.
- యాలాల, డిసెంబర్ 3

వ్యవసాయ విద్యకు ప్రాధాన్యం

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 3: దేశంలో వ్యవసాయ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకుడు(డీఆర్) డా.రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి, కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి డా.రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకొని వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..